క్లుప్తంగా

అంబేడ్కర్ గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చుండూరు(వేమూరు): ఆర్థికంగా వెనుకబడిన సామాజిక వర్గాల్లోని విద్యార్థుల నుంచి అంబేడ్కర్ గురుకులం దరఖాస్తులు ఆహ్వానిస్తోందని ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ తెలిపారు. ఐదో తరగతి, ఇంటర్ లో చేరేందుకు దరఖాస్తులు కోరుతున్నట్లు చెప్పారు. ఫిబ్రవరి 23 లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఐదో తరగతి ప్రవేశ పరీక్ష మార్చి 10న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్ష అదేరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 వరకు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు.

నగరం ఎస్ఐగా కోటేశ్వరరావు



నగరం: నగరం ఎస్ఐగా పీ కోటేశ్వరరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా మార్కాపురం టౌన్ ఎస్ఐగా పనిచేస్తున్న కోటేశ్వరరావు బదిలీపై ఇక్కడికి వచ్చారు. నూతనంగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన కోటేశ్వరరావును పోలీసు సిబ్బంది అభినందించారు.

కాపు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడి ఎన్నిక

బాపట్ల అర్బన్: కాపు అసోసియేషన్ బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా పుప్పాల శేష తల్పసాయి నియమితులయ్యారు. కాపునాడు కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో సౌత్ ఇండియా కాపు అసోసియేషన్ ఏపీ స్టేట్ ప్రెసిడెంట్ వేల్పూరి శ్రీనివాసరావు నియామక పత్రాన్ని పుప్పాల శేషతల్ప సాయికి అందజేశారు. సమావేశంలో కాపు, తెలగ, బలిజ కార్యకర్తలు పాల్గొన్నారు.

పంట నమోదు వేగవంతం చేయండి

వేమూరు: రైతు భరోసా కేంద్రంలోని గ్రామ వ్యవసాయ సహాయకులు పంట నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని మండల వ్యవసాయాధికారిణి సునీత ఆదేశించారు. రైతులు రబీ సీజన్‌లో మినుము, పెసర, జొన్న, మొక్కజొన్న పంటలు సాగు చేశారని, ప్రతి పంటను నమోదు చేయడం జరుగుతుందని ఆమె చెప్పారు. మండలంలోని 10 వేల హెక్టార్లకు గానూ ఇప్పటి వరకు 8 వేల హెక్టార్ల మేర పంట నమోదు చేయడం జరిగిందన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి తొలి ప్రాధాన్యం



మహిళలకు ఆసరా నమూనా చెక్కు అందజేస్తున్న వరికూటి అశోక్‌బాబు



సమావేశానికి హాజరైన డ్వాక్రా మహిళలు

- వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి
- భట్టిప్రోలులో మహిళలకు ఆసరా నమూనా చెక్కుల పంపిణీ

భట్టిప్రోలు: రాష్ట్రంలో మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. శనివారం భట్టిప్రోలు రథం సెంటర్‌లో స్వయం సహాయక సంఘాల మహిళలకు నాలుగో విడత వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ అధ్యక్షతన స్థానిక రథం సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 1009 మహిళా సంఘాలకు రూ 6.12 కోట్ల విలువైన చెక్కులను అందజేశారు. అనంతరం అశోక్‌బాబు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ రంగంలో మహిళలకు పెద్ద పీట వేసిందన్నారు. నాడు వైఎస్సార్ నేడు ఆయన తనయుడు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అన్ని విధాలా అగ్రపీఠం వేశారన్నారు. కార్యక్రమంలో భాగంగా సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి డ్వాక్రా మహిళలతో పాటు అశోక్‌బాబు సతీమణి లక్ష్మి పాలాభిషేకం చేశారు. చిన్నారులు నిర్వహించిన కోలాటం ఎంతగానో ఆకట్టుకుంది. వీరిని అశోక్‌బాబు అభినందించి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దారా రవికిరణ్మయి, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి, వైస్ ఎంపీపీ కె. పిచ్చయ్యశాస్త్రి, ఎం. ఉషారాణి, కోఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్, పీఏసీఎస్ చైర్ పర్సన్లు గోవర్ధనగిరి చినబుజ్జి, జి.సాంబశివరావు, కార్పొరేషన్ డైరెక్టర్లు శేరు శ్రీనివాసరావు, పడమట శ్రీనివాసరావు, స్త్రీ నిధి మేనేజర్ పి. అశోక్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు ద్రాక్షావలి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, డ్వాక్రా మహిళలు, సీసీలు, యానిమేటర్లు, పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

బాపట్ల అర్బన్: పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు బాపట్ల మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలోని 14,17వ వార్డుల్లో శనివారం ఆయన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు. తాగునీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. రానున్న వేసవిలో పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నీటిని సరఫరా చేస్తామని వెల్లడించారు.

దేవదాయశాఖ సహాయ కమిషనర్‌గా అనుపమ



చెరుకుపల్లి: చెరుకుపల్లిలో దేవస్థాన కార్యనిర్వహణాధికారిగా పనిచేస్తున్న మంతెన అనుపమ గుంటూరు దేవదాయ శాఖలో జిల్లా సహాయ కమిషనర్‌గా పదోన్నతి పొందారు. అనుపమ 2007లో దేవదాయ ధర్మాదయ శాఖలో గ్రేడ్-1 కార్యనిర్వహణాధికారిణిగా వేమూరు, కొల్లూరుల్లో విధులు చేపట్టారు. ప్రస్తుతం కనగాల గంగా పార్వతీ సమేత శ్రీ పృథ్వీశ్వర స్వామి దేవస్థానంలో కార్యనిర్వహణాధికారిణిగా విధులు నిర్వహిస్తున్నారు.

ఉపాధ్యాయులకు చేతిరాతపై శిక్షణ



హ్యాండ్ రైటింగ్ నోటు పుస్తకాలతో ఉపాధ్యాయులు

ఐలవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఐలవరం జెడ్పీ హైస్కూల్‌లో శనివారం ఉపాధ్యాయులకు గుడ్ హ్యాండ్ రైటింగ్‌పై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఉప్పల రామ్మోహన్‌రావు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎంఈవో-2 నీలం దేవరాజు ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు చక్కటి హ్యాండ్ రైటింగ్ చాలా ముఖ్యమని తెలిపారు. ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులకు కూడా శిక్షణ ఇచ్చారు. శిక్షణా కార్యక్రమానికి మండలం నుంచే కాక ఇతర మండలాల నుంచి సైతం ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులకు హ్యాండ్ రైటింగ్ నోటు పుస్తకాలు అందజేశారు. కార్యక్రమానికి హైస్కూల్ పూర్వ విద్యార్థి నల్లూరి శ్రీకాంత్ సహకారమందించగా హెచ్ఎం మాచర్ల మోహన్‌రావు పర్యవేక్షించారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం

- ఎమ్మెల్యే కోన రఘుపతి
- కర్లపాలెంలో మండల స్థాయి బూత్ కమిటీ సభ్యుల సమావేశం



బూత్ కమిటీ సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘుపతి

కర్లపాలెం: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందని ఎమ్మెల్యే కోన రఘుపతి ధీమా వ్యక్తం చేశారు. కర్లపాలెంలోని పెద్దింటమ్మ కల్యాణ మండపంలో శనివారం జరిగిన మండల స్థాయి బూత్ కమిటీ సభ్యుల సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు యథాతథంగా కొనసాగాలంటే వైఎస్. జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఎంపీపీ యారం వనజ, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, ప్రముఖ సినీ రచయిత కోన వెంకట్, జేసీఎస్ కన్వీనర్ సమ్మెట వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీలు పందరబోయిన సుబ్బారావు, కాగిత బుల్లియ్య, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

షర్మిల వ్యాఖ్యలు అర్ధ రహితం

బాపట్ల అర్బన్: ఏపీలో భూస్థాపితమైన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, అలాంటి పార్టీలో షర్మిల పని చేయడం సిగ్గుచేటని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. బాపట్ల పర్యటనలో భాగంగా షర్మిల తనపై చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. శనివారం తన ఛాంబర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మీద గానీ, ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మీద గానీ తప్పుడు వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండతో బాపట్లని జిల్లాగా చేసుకోవడం సాధ్యమైందని తెలిపారు. బాపట్లలో ఏమి అభివృద్ధి చెందలేదో చూపాలని ప్రశ్నించారు. త్వరలోనే ప్రాంతీయ పార్టీకి, జాతీయ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో బాపట్ల మండలం పార్టీ అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గవిని కృష్ణమూర్తి, బాపట్ల మండల జేసీఎస్ కన్వీనర్ వడ్డిముక్కల డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు



వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారితో డాక్టర్ ఈవూరి గణేష్

చెరుకుపల్లి: కుల మతాలకు అతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్ రెడ్డిని మరో మారు ముఖ్యమంత్రిని చేసేందుకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారని రేపల్లె నియోజకవర్గ సమన్వయ కర్త డాక్టర్ ఈవూరి గణేష్ అన్నారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో నగరం మండలం జనసేన పార్టీ కార్యదర్శి కోటిపల్లి సంపత్ రాంబాబు ఆధ్వర్యంలో 50 మంది ఆ పార్టీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వీరికి డాక్టర్ ఈవూరి గణేష్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కుల మతాలు, పార్టీలను చూడకుండా అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని దీనికి ఆకర్షితులమై డాక్టర్ గణేష్ ద్వారా పార్టీలో చేరామని రాంబాబు తెలిపారు.

గర్భిణీలకు పౌష్టికాహారం అందజేత



పౌష్టికాహారం అందజేస్తున్న నిర్వాహకులు

భట్టిప్రోలు: భట్టిప్రోలులోని శ్రీ సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన గర్భిణీలకు శుక్రవారం పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా భజన మండలి కన్వీనర్ మానేపల్లి సుబ్బారావు మాట్లాడుతూ గర్భిణీలకు ఈ సమయంలో పౌష్టికాహారం ఎంతో ముఖ్యమని భావించి ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భజన మండలి నిర్వాహకులు దివి శ్రీరామకృష్ణ, వెంకటేశ్వరరావు, సభ్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.